జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శనివారం 23 మే 2026 పేజీలు : 14





2 లో..

## వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

# ఇంటింటి సర్వే తో సమాచారం సేకరించాలి - ఆర్డీవో రమణారెడ్డి

మిర్యాలగూడ ,మే 22, ( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడలో ఓటర్ జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ప్రస్తుతం మిర్యాలగూడలో జరుగుతున్న మ్యాపింగ్ పూర్తి చేసేందుకు ఇంటింటికి తిరిగి సమాచారం సేకరించాలని ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్వే సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాలో 2002 జాబితా పోల్చాలని అందులో పేరు లేని వారు, తప్పుగా ఉన్న వారు ఫారం -8 ద్వారా సరి చేసుకోవాలని అవగాహన కల్పించాలని ఆయన కోరారు. డివిజన్ లో ని మిర్యాలగూడ పట్టణంలోనే మ్యాపింగ్ శాతం తక్కువగా ఉందని వందకు వంద శాతం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్లను పర్యవేక్షణ చేస్తు అర్థం కాకుంటే వివరించాలని కోరారు. సమావేశంలో మునిసిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, తహసీల్దార్ పి.శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ఎన్నికలు ఆర్.ప్రవీణ్ కుమార్, ఐసీడిఎస్ సూపర్ వైజర్ కె.నాగమణి పాల్గొన్నారు.



## ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ...



**అనంతగిరి మే 22 (ప్రజాజ్యోతి):** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ కంటు లాజర్, ఉపసర్పంచ్ గింజుపల్లి జగన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి పనులకు వచ్చే కూలీలు వడదెబ్బ బారిన పడకుండా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గింజుపల్లి రఘు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు ఉయ్యాల వీరయ్య గౌడ్, వార్డు సభ్యులు శీలం శ్రావణి నాగేంద్రబాబు, మాధవి గోపి, పాల్గొన్నారు.

## గ్యాస్ డెలివరీ బాయ్స్ కు బ్లౌజులు పంపిణీ

**మోత్కూరు, మే 22 (ప్రజా జ్యోతి):** మోత్కూర్ భారత్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో 5 వాహనాములను భారత్ గ్యాస్ వినియోగదారులకు పంపిణి చేయుటకు డెలివరీ బాయ్స్ కు చేతి బ్లౌజులు, టోపీలు, మజ్జిగ ప్యాకెట్లును శుక్రవారం గ్యాస్ కార్యాలయం ఇంచార్జ్ చిప్పలపల్లి యాదగిరి అందజేశారు. ఈ కార్యక్రమంలో యాకు, ప్రభాకర్, వెంకన్న లు పాల్గొన్నారు.






## ఆర్థిక ఇబ్బందులు, అప్పులవాళ్ళ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

2

## బేకరీ నిర్వాహకురాలుపై ఫిర్యాదు

**ఆలేరు మే 22 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు రైల్వే గేటు ప్రాంతంలోని శ్రీనివాస బేకరీలో కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తున్నారు. దీంతో కొద్ది రోజులుగా ఈ బేకరీలో తినుబండారాలు కొనుగోలు చేసి తింటున్న వారు అస్వస్థకు గురవుతున్నారు. శుక్రవారం కూడా ఇలాంటి సంఘటనే పునరావృతం కావడంతో బాధితులు పల్లె సంతోష్ బేకరీ నిర్వాహకురాలు సముద్రాల కల్పనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి బేకరీలో చెకోడీల ప్యాకెట్టు కొనుగోలు చేశానని వీటిని తన మూడేళ్ల వయసుగల కొడుకు కు తిను క్రమంలో వాంతులు చేసుకున్నాడని చెప్పారు. బేకరీ కి వెళ్లి నిర్వాహకురాలు కల్పనను అడగగా తనపై దౌర్జన్యానికి దిగిందని నిర్లక్ష్యంగా మాట్లాడిందన్నారు. కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కల్పనపై కేసు నమోదు చేయాలని పోలీసు లకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశానని సంతోష్ కుమార్ చెప్పారు కాగా బికిరిని పోలీసులు తనిఖీ చేశారు.






2

## నేటి నిర్లక్ష్యం... రేపటి పంటలకు ప్రమాదం

# వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నాంపల్లి, మే,22(ప్రజా జ్యోతి):**

ఐకెపీ వీవోఏ లు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలో వివోఏ లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహాశీల్దార్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు ఎస్కే సైదాబేగం మాట్లాడుతూ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు కనీస వేతనం రూ. 20,000 చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి. ప్రమాద బీమా కల్పించాలని, గ్రామాల్లో ఉచిత ట్యాబ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. జీవో నెంబర్ 58 సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె విరమించే ప్రసక్తే లేదని చెప్పారు.

# నేటి నిర్లక్ష్యం... రేపటి పంటలకు ప్రమాదం

**భూదాన్ పోచంపల్లి, మే 22 (ప్రజాజ్యోతి):**

వ్యవసాయం మన దేశానికి వెన్నెముక వంటిది. రైతు కష్టపడి పండించే పంటల వల్లే ప్రతి ఇంటిలో అన్నం వండుతుంది. అయితే పంట కోతల అనంతరం కొంతమంది రైతులు పొలాల్లో మిగిలిపోయిన గడ్డి, పంట అవశేషాలను తగులబెడుతున్నారు. ఇది తాత్కాలికంగా సులభమైన మార్గంలా కనిపించినా, దీని వల్ల పర్యావరణానికి, భూమికి, మన ఆరోగ్యానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది. పొలాలను తగులబెట్టడం వల్ల గాలిలో భారీగా పొగ వ్యాపిస్తుంది. ఈ పొగ వలన వాయు కాలుష్యం పెరిగి ప్రజలు శ్వాసకోశ సమస్యలకు గురవుతారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడతారు. అంతేకాకుండా రోడ్లపై పొగ కమ్ముకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఉంటాయి. భూమిలో ఉండే సూక్ష్మజీవులు, పోషకాలు పంటలకు ఎంతో అవసరం. పొలాలను కాల్చడం వల్ల ఈ ఉపయోగకరమైన జీవులు నశించి భూమి సారవంతత తగ్గిపోతుంది. తద్వారా భవిష్యత్తులో పంట దిగుబడి కూడా తగ్గే ప్రమాదం ఉంది. రైతులు ఎక్కువ ఎరువులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పంట అవశేషాలను తగులబెట్టకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించవచ్చు. పశువులకు మేతగా వినియోగించవచ్చు. అలాగే యంత్రాల సహాయంతో అవశేషాలను నేలలో కలిపితే భూమి మరింత సారవంతంగా మారుతుంది.

# ఆర్థిక ఇబ్బందులు, అప్పులవాళ్ళ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య

**మిర్యాలగూడ, మే 22,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి కుందూరు గోపి (23) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల మేరకు మృతుడు గోపి సెంట్రింగ్ పని చేస్తుండగా, భార్య శ్రీదేవి పట్టణంలోని బట్టల షాపులో పనిచేస్తుంది. ఇటీవల గోపి ఫైనాన్స్ లో బైక్ తీసుకున్నాడు. ఈఎంఐ లు సక్రమంగా చెల్లించలేక అప్పుల పాలై హౌసింగ్ బోర్డ్ కాలనీ కి చెందిన గుండ్లపల్లి రాము, రాజ్యలక్ష్మి ల వద్ద అప్పు తీసుకున్నాడని, అందులో కొంత చెల్లించాడని సమాచారం. మిగిలిన అప్పు డబ్బుల కోసం సదరు రాము రాజ్యలక్ష్మి లు ఇటీవల గోపి పై ఒత్తిడి తీసుకువచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈనెల 21 న, గోపి భార్య శ్రీదేవితో పనికి వెళుతున్నాను చెప్పి బయటికి వెళ్లాడు, శ్రీదేవి యధావిధిగా తాను పనిచేస్తున్న బట్టల షాపుకి వెళ్లిపోయింది. తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకున్న శ్రీదేవికి తలుపు తాళం వేసి ఉండటం,వెనకవైపు గడి పెట్టి ఉండటంతో, భయపడుతూనే మరో తాళం చెవితో తెరిచి చూడగా చీరతో గోపి ఉరివేసుకొని కనపడ్డాడు. దీంతో తీవ్ర భయాందోళన చెందిన శ్రీదేవి సమీపంలో ఉన్న అత్తమామలకు విషయం తెలిపి విలపించింది. వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికీ గోపీ చనిపోయి ఉన్నాడు.ఈ సంఘటనపై మృతుడి తండ్రి నరసింహారావు ఆర్థిక ఇబ్బందులు,అప్పుల వాళ్ళ వేధింపుల తోటి తన కుమారుడు మృతి చెందాడని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నాగభూషణరావు తెలిపారు.

# ఉప సర్పంచ్ల మండల ఫోరం అధ్యక్షుడిగా భూక్యా నాగు నాయక్

**మఠంపల్లి మే 22 (ప్రజా జ్యోతి)**

మఠంపల్లి మండల ఉప సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షునిగా కిందితండా గ్రామ ఉపసర్పంచ్ భూక్య నాగు నాయక్ ను ఏకగ్రీవంగా మండలంలోని అన్ని గ్రామాలకు ఉప సర్పంచ్ లు పాల్గొని ఎన్నుకున్నారు. సర్పంచ్ల ఫోరం మండల ఉపాధ్యక్షులుగా మఠంపల్లి గ్రామ ఉపసర్పంచ్ కొత్తపల్లి శౌరి ని,ప్రధాన కార్యదర్శిగా పెదవీడు ఉప సర్పంచ్ మల్ రెడ్డి త్రివేణి కోటిరెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. మఠంపల్లి మండల ఉప సర్పంచ్ల పోరం మండల అధ్యక్ష ఎన్నికకు సహకరించిన మంత్రివర్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి, మఠంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య మంజునాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా హుజూర్నగర్ నియోజకవర్గ



నూతన కమిటీ ఇన్చార్జ్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మల్రెడ్డి కృష్ణారెడ్డి గారికి మఠంపల్లి మండలంలోని గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ల సహకారంతో ఏకగ్రీవంగా ఉప సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షుడికి ఎన్నుకోవడం జరిగింది.

# హాలియాలో 30 పడకల ఆస్పత్రుని ప్రారంభించాలి - మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

**హాలియా,మే22(ప్రజా జ్యోతి)**

హాలియాలో 30 పడకల ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. శుక్రవారం హాలియా పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ



ఆసుపత్రిని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం




మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై పనులు పూర్తయిన ఆసుపత్రిని ప్రారంభించకుండా స్థానిక ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. హాస్పిటల్ ప్రారంభమైతే పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్యానికి అందుబాటులోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన హాస్పిటల్ కు మాజీ సీఎం కు పేరు వస్తుందని అక్కసు తోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభోత్సవం చేయడం లేదని ఆరోపించారు. సాగర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యాడని తెలిపారు. తక్షణమే నిర్మాణం పూర్తయిన ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ ఎడవల్లి విజయేందర్ రెడ్డి,రిక్కల ఇంద్రసేనారెడ్డి,కర్ణ నర్సిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు,పట్టణ పార్టీ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి, చాపల సైదులు,సురభి రాంబాబు, రావులపాటి ఎల్లయ్య,కూరాకుల రవి,సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఎస్సై లింగారెడ్డి

**నాంపల్లి, మే,22(ప్రజా జ్యోతి):**

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు శుక్రవారం నాంపల్లి బస్టాండ్ సెంటర్లో స్థానిక పోలీస్ శాఖ ఎస్సై కే లింగారెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటపాటలతో పోలీసుల కళాబృందం రోడ్డు భద్రత పట్ల జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్సై ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణప్రాయం నుండి రక్షణ పొంది, సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం చాలామంది వాహనదారులు రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగానే మరణిస్తున్నారు. నిన్నే నమ్ముకున్న కుటుంబాన్ని రోడ్డున పడేయొద్దన్నారు. మద్యం లేదా మత్తు పదార్థాలు సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదు. డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్లు వాడటం చేయకూడదు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా శిక్షించబడతారని, వాహనాలు సీజ్ చేస్తాం అని తెలిపారు. అదేవిదంగా వేసవి దృష్ట్యా ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించోద్దన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రేమ పేరుతో ఆడపిల్లలు మోసపోయి, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. ఆడపిల్ల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రారెడ్డి, చల్లవానికుంట గ్రామ సర్పంచ్ చందు నాయక్, నాంపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పానగంటి వెంకటయ్య, పోలీసు సిబ్బంది, పోలీసుల కళాబృందం, గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



**నాంపల్లి,మే,22(ప్రజా జ్యోతి)**:

మండలంలోని గానుగుపల్లి గ్రామంలో బెల్ట్ షాపులు నిర్మించాలని గ్రామస్తులు నడుం బిగించారు. గ్రామ సర్పంచ్ ఆకులపల్లి పర్వతాలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి గుడుంబా, గంజాయి, బెల్ట్ షాపులు నిషేధించుటకు తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరు బెల్ట్ షాపులు నడిపిన జరిమానా విధించడంతో పాటు చట్టరీత్యా శిక్షించబడతారని అన్నారు. మత్తుకు బానిస కావడంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా, ఉన్నతమైన మార్గాన్ని ఎంచుకొని బాగుచేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

# సింగిల్ విండో ఛైర్మన్ గా అవకాశం ఇవ్వండి


**గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశా**

**30 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నా**

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కోరుతున్న మాజీ డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్**

**సంస్థాన్ నారాయణపురం,**

మే 22, (ప్రజాజ్యోతి) : రైతుల కోసం గత 30 ఏళ్ల గా పనిచేస్తున్నానని, గత టిఆర్ఎస్ ప్రభుత్వం పై ఎన్నో పోరాటాలు చేశారని తనకు సింగిల్ విండో ఛైర్మన్ గా అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని మాజీ డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్ కోరారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 201 3 సింగిల్ విండ ో డైరెక్టర్ గా గెలిచి వైస్ ఛైర్మన్ గా పనిచేశానన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం లో రైతు సమస్యలపై అనేక పోరాటాలు చేసినట్లు తెలిపారు. కరువు కాటకాలపై రాచకొండ భూ సమస్యపై, సాగు జలాల సమస్యలపై అనేకమార్లు మండల తహసిల్దార్ కలెక్టరేట్ల వద్ద రైతులతో కలిసి నిరసనలు చేసినట్టు తెలిపారు. తాను వైస్ ఛైర్మన్గా సింగిల్ విండో ద్వారా రైతులకు అనేక సేవలు చేయడంతో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండ రెడ్డి నన్ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించాడన్నారు. మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేసినట్లు వివరించారు. రాజగోపాల్ రెడ్డి గెలుపు కోసం తన ఎంతో కృషి చేశానని, ప్రతి ఎన్నికల్లో నువ్వు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తున్నాను తెలిపారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సింగిల్ విండో ఛైర్మన్ గా నాకు అవకాశం కల్పించాలని ఏపూరి సతీష్ కోరారు.




# చిన్న నిర్లక్ష్యం... భారీ నష్టం !

**మోత్కూరు, మే 22 (ప్రజా జ్యోతి):**

ఒక చిన్న నిర్లక్ష్యం ....భారీ నష్టానికి కారణమైంది. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఇంగీసమ్మ కుంట సమీప పంట పొలాల్లో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. చెరువుకట్ట కింద ఉన్న పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు వేసిన అగ్గి పుల్లతో వరి కొయ్యలకు మంటలు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి సమీపంలోని గడ్డి వాములను ఆవరించాయి. గాలి ఉధృతికి మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. సమీపంలో పశువుల కొట్టాలు కూడా ఉండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. మరోవైపు అక్కడికి చేరుకున్న రైతులు కొట్టాల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలు గడ్డి వాములను చుట్టుముట్టి ఎగసిపడుతుండడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో బాధిత రైతులు నిలిగొండ రమేష్, నిలిగొండ



సోమయ్యలకు చెందిన సుమారు వెయ్యి మోపుల గడ్డి పూర్తిగా దగ్ధమైంది. పశువుల మేత కోసం ఎంతో కష్టపడి నిల్వ చేసుకున్న గడ్డి అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకతాయిలు చేసిన ఒక నిర్లక్ష్య పని వల్ల తమ గడ్డి పూర్తిగా దగ్ధమవడంతో మొత్తంగా సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకులు బద్దం రాంరెడ్డికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సామెల్

**మోత్కూరు, మే 22 (ప్రజా జ్యోతి):**

మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం రాంరెడ్డి చిత్ర పటానికి తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామెలు శుక్రవారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు ఫైళ్ళ సోమిరెడ్డి , జిల్లా కాంగ్రెస్




నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహా రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగొని రామచంద్రు గౌడ్, పిఎసిఎస్ ఛైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు చౌదరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ గనగాని శైలజ నర్సింహా, బద్దం నాగార్జున్ రెడ్డి, మందుల సురేష్, సుంకిశాల అనిల్, చింతల విజయ్ భాస్కర్ రెడ్డి, జినుకల కనకయ్య, అవిశెట్టి నాగరాజు, అవిశెట్టి రాజాలు , కుటుంబ సభ్యులు బద్దం శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం.. ఎస్సై శ్రీకాంత్ గౌడ్

**గరిడేపల్లి,మే 22(ప్రజా జ్యోతి):**

గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమ ని ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కల్మల్ చెరువు గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆరోగ్య పరిరక్షణకు,మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడే క్రీడలను ప్రతిఒక్కరూ అలవాటు గా మార్చుకోవాలని సూచించారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని,ఓడిన వారు నిరాశ చెందకుండా గెలుపొందిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు.వేసవి సెలవుల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇటువంటి క్రీడా పోటీలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి యువతకు



సహకారం అందించాలని ఆయన కోరారు.క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కల్మలచెరువు యువజన సంఘం సభ్యులు,క్రీడా పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుడికి ఛైర్మన్ ఆర్థిక సాయం

**హాలియా,మే22(ప్రజా జ్యోతి)**

మున్సిపాలిటీలో పంపు ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న మహేష్ గత రెండు రోజుల క్రితం అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో నల్లగొండ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి గుండె ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న హాలియా మున్సిపల్ ఛైర్మన్ చింతల చంద్రారెడ్డి వెంటనే మహేష్ ను శుక్రవారం కమిషనర్ కే.రవీందర్ రెడ్డి కౌన్సిలర్లతో కలిసి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చికిత్స కోసం ఛైర్మన్ చింతల చంద్రారెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు.కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, దేపావత్ ప్రసాద్ నాయక్,కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు,మజాహర్ మొహినుద్దీన్, కొమ్మనబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ శాఖలో కందిబండ వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం.. ఉత్తమ సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

**కోదాడ టౌన్, మే 22 (ప్రజా జ్యోతి):**

విద్యుత్ శాఖలో నిబద్ధతతో సేవలు అందించిన కందిబండ వెంకటేశ్వరరావు ను ఆదర్శంగా తీసుకొని ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆ సంఘ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏనుగుల శ్రీధర్, సూర్యాపేట జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు లు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలో గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి మేడే సందర్భంగా శ్రమ శక్తి అవార్డు అందుకున్న





కందిబండ వెంకటేశ్వరరావును హుజూర్నగర్ 327 యూనియన్, ఆవోప సూర్యాపేట జిల్లా సంఘం ఆధ్వర్యంలో వారికి ఘనంగా ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ విద్యుత్ రంగ కార్మికుల సంక్షేమానికి, విధుల్లో ఆయన అందించిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందించడం గర్వకారణమన్నారు. ఆయన ఎక్కడ పని చేసినా ఆయన చేసిన సేవలు ద్వారా అక్కడి ప్రజలందరి మన్ననలు పొందాలని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వారి దంపతులను శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు, ఆవొపా వ్యవస్థాపక అధ్యక్షులు గొళ్ళ చంద్రయ్య, రాష్ట్ర బాధ్యులు ఐలయ్య, నాగయ్య, 327 హుజూర్నగర్ అధ్యక్షులు సురేష్, అవొపా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి జనార్ధన్, ఉపాధ్యక్షులు చెన్నకేశవరావు, అధ్యక్షులు ఇమ్మడి రమేష్, డి ఈ వెంకట కృష్ణయ్య, ఏడీఈలు రమణా నాయక్, వెంకన్న, అవొపా కోదాడ ప్రధాన కార్యదర్శి చారుగండ్ల రాజశేఖర్, మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు, మధుసూదన్, పందిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే జి పి ఎల్

## జిపిఎల్ సీజన్ - 2 ప్రారంభించిన ఎన్ వి ఆర్

**మిర్యాలగూడ, మే 22,( ప్రజాజ్యోతి ):**

గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను వెలికి తీసేందుకే జిపిఎల్ నిర్వహిస్తున్నామని నూకల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ నందు నూకల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జి పి ఎల్ సీజన్ - 2 క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఎన్ వి ఆర్ యూత్ మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో జి పి ఎల్ సీజన్ -1 ను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా యువతను ప్రోత్సహిస్తూ జిపిఎల్ సీజన్ -2 ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం యువతకు క్రీడా ప్రోత్సాహంతోపాటు, యువతను సన్మార్గంలో నడిపించడానికి ఎన్ వి ఆర్, బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఇటువంటి టోర్నమెంట్ తో పాటు జూనియర్ కాలేజీ గ్రౌండ్ నందు పిల్లలకు ఉదయం ఉచిత సమ్మర్ వాలీబాల్ మరియు హ్యాండ్ బాల్ కోచింగ్ ఏర్పాటు చేశామన్నారు. చిన్నపిల్లలకు ఫిజికల్ ఫిట్నెస్ గేమ్స్ ఆడిపిస్తూ ప్రతి ఒక్కరికి ఒక గుడ్డుతో పాటుగా పౌష్టిక ఆహారం మరియు ఫ్రూట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు . ఇప్పుడు ఉన్న సాంకేతిక యుగంలో పిల్లలకు ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు హార్మోన్ ఇన్ బ్యాలెన్స్ ఉంటున్నది కావున క్రీడలు చాలా అవసరమన్నారు. వారి మానసిక ధైర్యానికి దేహ దారుడ్యానికి, భవిష్యత్తులో వారి జీవితం లో ఎటువంటి కష్టాలు,మానసిక ఒత్తిడిలను తట్టుకొని సమాజం లో నిలబడటానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నా రు. నూకల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిపిఎల్ టు క్రికెట్ టోర్నమెంట్ నియోజకవర్గంలో ఎంతో మంది క్రీడాకారులని వారి ప్రతిబని వెలికితీస్తూ రాష్ట్ర,జాతీయ స్థాయికి ఎదిగే విధంగా ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా మునుముందు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడ మరియు వివిధ రంగాలలో పోటీలు నిర్వహించి ఇక్కడి నుండి జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే విధంగా క్రీడాకారులను తయారు చేయటమే మా చారిటబుల్ ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశమని,రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు మా ట్రస్టు ఎప్పుడు వెన్ను తట్టి ప్రోత్సహిస్తుందని



తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి,6వ, వార్డు కౌన్సిలర్ ఆడోత్అశోక్ నాయక్, ఫి డి కన్నెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి,ఐదో వార్డ్ కాంగ్రెస్ ఇన్చార్జి జవహర్ నాయక్,ఆర్గనైజర్ గడగోజు అశోక చారి లక్ష్మణ్,మహేష్ ,నాగరాజు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# అధికారం కోసం పగటి కలలు కంటున్న కేటీఆర్



**మోత్కూరు, మే 22 ( ప్రజా జ్యోతి):**

అధికారం కోసం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పగటి కలలు కంటున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. శుక్రవారం ఆయన మోత్కూరులోని గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని విష ప్రచారం చేయడం తగదన్నారు. కేటీఆర్ నైతిక విలువలు మర్చిపోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకొని హౌలే గాడు అంటూ కేటీఆర్ అదుపు తప్పి అజ్ఞానిగా మాట్లాడుతున్నారని అన్నారు. అమరుల త్యాగాల ఫలితంగా గత 10 ఏళ్లుగా అధికారాన్ని అనుభవించి అధికారం కోల్పోయిన తర్వాత కూడా ఇంకా అహంకారంతో చిల్లర, మల్లర మాటలు కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఇక నుంచి ఇటువంటి మాటలు బంద్ చేసుకోవాలని సామేల్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో ఇబ్బందులు పడ్డారని వివరించారు. మహిళా కమిషన్ సభ్యురాలిగా నియామకమైన కాసోజు శంకరమ్మ ను ఈనెల 28న మోత్కూర్ లోని వై. జె .గార్డెన్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, పిఎసిఎస్ చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మాజీ చైర్మెన్ చింతల విజయభాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**మిర్యాలగూడ, మే 22,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ మండలం తక్కెళ్ళపాడు శివారులో శుక్రవారం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ఎం. లక్ష్మయ్య తెలిపారు. ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు పాలేరు వాగు నుండి ఇసుక రవాణా చేస్తూ మిర్యాలగూడ వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురుపడటంతో, అనుమతి పత్రాలు పరిశీలించగా లేకపోవడంతో పోలీస్ స్టేషన్ కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్ దొంతగాని బిక్షం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# వడ్ల కొనుగోలు ప్రక్రియ 20% జరిగింది

**ఆలేరు మే 22 ప్రజా జ్యోతి**

ఆరుకాలం కష్టపడి పండించినటువంటి పంటను ఐకెపి సెంటర్ లో పిఎసిఎస్ సెంటర్లో ఒడ్డు పోసి నెల రోజులు గడిచిపోతున్న లారీలు రాక రైతులు నాన్న ఇబ్బందులు పడుతున్నారని మోట కొండూరు బిజెపి పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి అన్నారు.



శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యాదగిరిగుట్ట నుంచి మోటకొండూరు వరకు స్థానిక ఎమ్మెల్యే అయినటువంటి బీర్ల ఐలయ్య పెట్రోల్ ధరలు పెరినాయని సైకిల్ యాత్ర చేయడం విడ్డూరమన్నారు. సైకిల్ యాత్ర బాగానే ఉంది కానీ మీరు ఈ యాత్రలు చేసే దానికంటే ముందు చేయవలసిన పని ఇంకొకటి ఉంది రైతులు కష్టపడి పండించినటువంటి పంటను కొనుగోలు కేంద్రాలలో పోసి 20 రోజులు అవుతున్నప్పటికీ వాటిని కొనుగోలు చేయకపోవడం బాధాకరమన్నారు. నేటికి వడ్ల కొనుగోలు ప్రక్రియ మాత్రం 20 మాత్రమే జరిగిందన్నారు. ఇంకా 80% వడ్లు కొనుగోలు కాలేదన్నారు. వెంటనే మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బిజెపి పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. అలాంటి కొనుగోలు చేయకపోగా పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచిందని సైకిల్ యాత్ర పేరుతో రీల్స్ చేసే కార్యక్రమం మొదలు పెట్టుకున్నారన్నారు. ఈ రీల్స్ కార్యక్రమం బందు చేసి పెట్రోల్ డీజిల్ పై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్నటువంటి సుంకం 39 రూపాయలు మీ ప్రభుత్వం తీసుకుంటుంది మీకు అంతా ప్రేమ రాష్ట్ర ప్రజల పైన ఉన్నది కదా అది కపట ప్రేమ అనేది మాకు తెలుసు కానీ మీరు ఆ ప్రేమను కనబరుస్తున్నారు కాబట్టి మీ ప్రభుత్వం విధిస్తున్న 39 రూపాయల సుఖాన్ని తగ్గించినట్లయితే రాష్ట్ర ప్రజల పైన భారం కూడా తగ్గుతుంది మీరు అది మర్చిపోయి అలాంటివి చేయకుండా సైకిల్ యాత్ర పేరుతో బిల్ డబ్బులు ఇచ్చే కార్యక్రమాలు బందు చేయడం మానుకోవాలన్నారు. మీకు అంత ప్రేమ ఉంటే ప్రజలపై మీరు అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే మద్యం రేట్లను పెంచడం జరిగిందన్నారు. మరి అది ఎందుకు మీకు కనబడడం లేదు ఇకముందు కూడా మీరు మద్యంపై ధరలు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు మాకు సమాచారం ఉంది అన్నారు. కాబట్టి మీరు ఇలాంటి యాత్రల తోటి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేసి ప్రజలను ఏదో చేద్దాం అనుకుంటే మాత్రం రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు.

# 5 లక్షల రూపాయల నష్టపరిహార చెక్కు అందజేత

**ఆలేరు మే 22 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన అయిలీ గిరిజర్ విద్యుత్ షాక్ కు గురి కావడంతో మృతి చెందిన కుటుంబానికి ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య 5 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల స్వామి, ఉప సర్పంచ్ నవనీత పరశురాములు, నాయకులు కృష్ణమూర్తి, హేమెంధర్ తదితరులు పాల్గొన్నారు



# దొంగలే దొంగ అన్నట్లు.. బీఆర్ఎస్ తీరు!

## నా ఎదుగుదల కష్టార్జితం.. మీలా అవినీతి సొమ్ము కాదు: రాజు గౌడ్

## రాజకీయ ఉనికి కోసమే అసత్య ఆరోపణలు

## సామాన్యుడు ఎదగడం ఓర్వలేరా?

## రాజగోపాల్ రెడ్డి బాటలోనే మా నిజాయితీ పయనం

**చౌటుప్పల్, మే 22 ( ప్రజా జ్యోతి):**

రాజకీయంగా పతనావస్థకు చేరుకుని, ప్రజల్లో ఉనికిని కోల్పోతున్న బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేత పబ్బు రాజు గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై బురదజల్లడమే లక్ష్యంగా కొందరు పనిగట్టుకుని చేస్తున్న అసత్య ఆరోపణలపై ఆయన నిప్పులు చెరిగారు. గురువారం చౌటుప్పల్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణుల తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ.. తాను కష్టపడి సంపాదించుకున్న ఆస్తులపై అవినీతి ముద్ర వేయాలని చూడటం హాస్యాస్పదమన్నారు. ఇది “దొంగలే దొంగ దొంగ” అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. “కేవలం దొరలకే విలాసవంతమైన జీవితం ఉండాలా కష్టపడి పైకొచ్చిన సామాన్యులకు ఉండకూడదా” అని ఆయన సూటిగా ప్రశ్నించారు.



తాను రాజకీయాల్లోకి రాకముందే కేబుల్ ఆపరేటర్ స్థాయి నుంచి వ్యాపారవేత్తగా అంచెలంచెలుగా ఎదిగానని, తన ఎదుగుదల వెనుక ఏళ్ల కష్టం ఉందే తప్ప మీలాంటి అవినీతి సొమ్ము లేదని స్పష్టం చేశారు. నిజాయితీకి నిలువుటద్దం మా నాయకుడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిష్కళంకమైన, తెల్ల కాగితం లాంటి స్వచ్ఛమైన నాయకుడని, ఆయన శిష్యులుగా తాము కూడా అదే నిజాయితీతో రాజకీయాల్లో కొనసాగుతున్నామని రాజు గౌడ్ వెల్లడించారు. వ్యాపార రంగంలో తాను సాధించిన వృద్ధిని తట్టుకోలేక సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే చట్టపరమైన చర్యలతో పాటు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్,సురుగు శ్రీనివాసులు మరియు ఇతర కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మృత్యువుపై గెలిచిన 'యశోద' వైద్యం!

## - అరుదైన ప్లాసెంటా పర్‌క్రెటాతో గర్భాశయం ముక్కలు..

## - గర్భిణికి పునర్జన్మ ప్రసాదించిన మలక్‌పేట్ వైద్య బృందం

**చౌటుప్పల్ మే 22 ( ప్రజా జ్యోతి ) :**

అరుదైన, అత్యంత ప్రాణాంతకమైన గైనకాలజికల్ అత్యవసర పరిస్థితి నుంచి ఒక మహిళను మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు చాకచక్యంగా కాపాడారు. “ప్లాసెంటా పర్‌క్రెటా” అనే తీవ్రమైన వ్యాధితో గర్భాశయం చీలిపోయి, మృత్యువుతో పోరాడుతున్న 27 ఏళ్ల గర్భిణికి వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. 28 వారాల గర్భంతో ఉన్న సదరు మహిళ తీవ్రమైన కడుపునొప్పి, అంతర్గత రక్తస్రావంతో అత్యంత విషమ స్థితిలో (హేమరేజిక్ షాక్) ఆసుపత్రిలో చేరారు. అప్పటికే గర్భంలోని శిశువు మరణించగా, ఆమె పొట్టలో సుమారు 3 లీటర్ల మేర రక్తం గడ్డకట్టి ప్రాణాలు పోయే పరిస్థితి దాపరించింది.

**యుద్ధప్రాతిపదికన 'మల్టీ-స్పెషాలిటీ' ఆపరేషన్**

పరిస్థితి తీవ్రతను గుర్తించిన యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డా. ఎం.వి. జ్యోత్స్న నేతృత్వంలోని నిపుణుల బృందం తక్షణమే రంగంలోకి దిగింది. క్రిటికల్ కేర్ నిపుణులు డా. కలాధర్ ఎస్, సీనియర్ ఫిజీషియన్ డా. గుత్తా శశిధర్ రెడ్డిలతో కూడిన బహుళ విభాగాల వైద్యులు యుద్ధప్రాతిపదికన లాపరోటమీ శస్త్రచికిత్సను చేపట్టారు. ఛిన్నాభిన్నమైన గర్భాశయ చీలికను విజయవంతంగా మరమ్మతు చేశారు. ఐసీయూలో నిరంతర పర్యవేక్షణ, సకాలంలో రక్తమార్పిడి, అత్యాధునిక క్రిటికల్ కేర్ చికిత్సతో మహిళ పూర్తిగా కోలుకోవడంతో ఆమెను సురక్షితంగా డిశ్చార్జ్ చేశారు. ఇలాంటి హై-రిస్క్ అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రాణాలు కాపాడేందుకు అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్యులతో నాణ్యమైన వైద్యం అందించడానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, ఎ వాసుకిరణ్ రెడ్డిలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# గణపారం యువకుడి హత్య కేసు లో ముగ్గురు నిందితుల అరెస్ట్!

### గే (పోలో) యాప్ లో పరిచయం అనంతరం హత్య....

### ఫోటోల గొడవతోనే దారుణం. కత్తి, ఫోన్లు స్వాధీనం

### ముఖ్య నిందితుడు సోమేష్ కోసం గాలింపు:

### కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి

**కోదాడ రూరల్, మే 22 (ప్రజాజ్యోతి):**

కోదాడ రూరల్ పోలీస్ పరిధిలోని గణపారం గ్రామ శివారులో ఈ నెల 15న జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను కనిపెట్టి, ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలను వెల్లడించారు.

**అసలు గొడవ ఎందుకు జరిగిందంటే?**

పోలీసుల విచారణలో తేలిన వివరాల ప్రకారం. గణపారం



శివారులోని తిప్పలదొడ్డి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో ఒక యువకుడు దారుణంగా హత్యకు గురైన సంగతి తెలిసిందే. చనిపోయిన యువకుడిని బలగురి గణేష్‌గా గుర్తించారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా గరిడేపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన పగిల్ల ఉదయ్ కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వ్యక్తిగత ఫోటోల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా ప్రధాన నిందితుడు బర్రెంకుల సోమేష్ తన స్నేహితుడి సహాయంతో మృతుడిని నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. గణేష్ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టడం, వ్యక్తిగత విషయాల్లో వాడటంపై హుజూర్‌నగర్‌కు చెందిన సోమేష్ అనే యువకుడికి, గణేష్‌కు మధ్య గొడవలు జరిగాయి.?ఈ కక్షతో సోమేష్, ఈ నెల 14వ తేదీ రాత్రి గణేష్‌ను గణపారం శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించాడు. అక్కడ కొత్తగూడెం గ్రామానికి చెందిన తన స్నేహితుడు ఉదయ్ కిరణ్ 20 ఏళ్లు సహాయంతో, ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం గణేష్‌పై రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఆ తర్వాత గొంతు నులిమి, కత్తితో గొంతు కోసి చంపేసి పారిపోయారు.?హత్య చేసిన తర్వాత నిందితుడు సోమేష్‌కు ఇంట్లో చోటు ఇచ్చి, అతను పారిపోవడానికి సహాయం చేసినందుకు గాను అతని తల్లి జ్యోతి, తండ్రి సాంబయ్య, తాత సాయిలును కూడా పోలీసులు ఈరోజే హుజూర్‌నగర్‌లోని వారి ఇంట్లో అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ముఖ్య నిందితుడు సోమేష్ పరారీలో



ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని డిఎస్పి చెప్పారు.

**ఘటనా స్థలంలో దొరికిన ఆధారాలు**

హత్య జరిగిన స్థలంలో రక్తం మరకలు ఉన్న రాళ్లు, ఖాళీ సీసాలు, బట్టలు, రక్తంతో ఉన్న మట్టిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితుల నుంచి ఒక కత్తిని, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ఈ కేసును వేగంగా ఛేదించిన మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, వారి సిబ్బందిని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ప్రత్యేకంగా అభినందించారు.

**సోషల్ మీడియా పరిచయాలతో జాగ్రత్త!**

"ఇలాంటి తప్పులు చేస్తే ఎంతటి వారైనా సరే కఠినమైన శిక్షలు పడతాయి. ఈ మధ్య కాలంలో యువత సోషల్ మీడియాలో వచ్చే పరిచయాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎలాంటి గొడవలు ఉన్నా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, పెద్దల సమక్షంలో లేదా పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి తెలుగు చేశారు.

# రేషన్ డీలర్ల ఎంపికలో అవకతవకలు నిరుద్యోగుల తీవ్ర ఆవేదన

దేవరకొండ, మే 22,(ప్రజాజ్యోతి):

దేవరకొండ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన నూతన రేషన్ డీలర్ల నియామకాల్లో తీవ్ర అవకతవకలు, అక్రమాలు జరిగాయంటూ బాధితులు తీవ్ర ఆగ్రహం మరియు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో అర్హులైన తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదుట బాధితులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.?నిరుద్యోగుల ఆవేదన మరియు ప్రధాన ఆరోపణలు చేస్తూ ?ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరగాల్సిన ఈ ఎంపిక ప్రక్రియ పూర్తిగా అక్రమాలతో నిండిపోయిందని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు.?విద్యార్హతకు దక్కని గౌరవం డిగ్రీ వంటి ఉన్నత చదువులు చదివి, పూర్తి అర్హతలతో ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులకు కావాలనే అత్యంత తక్కువ మార్కులు వేశారు.?అనర్హులకు పెద్దపీట వేస్తూ కనీస అవగాహన, సరైన విద్యార్హతలు లేని వారికి విపరీతంగా ఎక్కువ మార్కులు వేసి ఎంపిక చేయడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వారు ఆరోపిస్తున్నారు. చదువుకున్న తమను కాదని, కనీస విషయాలు తెలియని వారికి ప్రాధాన్యత ఇవ్వడం తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమేనని నిరుద్యోగులు వాపోతున్నారు.?పారదర్శకత శూన్యం మెరిట్ ఆధారంగా కాకుండా కేవలం తెరవెనుక నడిచిన లాబీయింగ్ వల్లే ఈ నియామకాలు జరిగాయని, అర్హత కలిగిన తమ శ్రమకు విలువ లేకుండా పోయిందని అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరిగిన రేషన్ డీలర్ల నియామక ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి (రద్దు చేయాలి). ఉన్నతాధికారుల పర్యవేక్షణలో దీనిపై సమగ్ర విచారణ జరిపించాలి. పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా పరీక్షలు/ఇంటర్వ్యూలు నిర్వహించి, ఈ ఎంపిక ప్రక్రియను మళ్లీ మొదటి నుండి చేపట్టాలి అని ఆవేదన వ్యక్తం చేశారు.?ఈ మేరకు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ, అర్హులైన వారికే ఉద్యోగాలు దక్కేలా చూడాలని కోరుతూ బాధితులు ఆర్డీఓ గారికి ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని నిరుద్యోగ యువత వేడుకుంటోంది.



# సింగిల్ విండో చైర్మన్ పదవి ఎస్టీలకు ఇవ్వాలి

### గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు జలంధర్ నాయక్

**సంస్థాన్ నారాయణపురం,**



మే 22, (ప్రజాజ్యోతి) : సంస్థాన్ నారాయణపురం సింగిల్ విండో చైర్మన్ పదవిని గిరిజనులకే ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు నేనావత్ జలంధర్ నాయక్ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని కోరారు. ఇప్పటివరకు సింగిల్ విండో చైర్మన్ పదవిని గిరిజనులకు ఇవ్వలేదన్నారు. మండలంలో సగం మంది గిరిజన జనాభా ఉన్నదని తెలిపారు. కానీ ఇప్పటివరకు విండో చైర్మన్ గా అవకాశాలు రాలేదని, ఈసారైనా చైర్మన్ గా అవకాశం కల్పించాలని కోరారు.

# దివ్యాంగుల స్వయం ఉపాధి అభివృద్ధికి కృషి



**హాలియా,మే22(ప్రజా జ్యోతి)**

దివ్యాంగుల స్వయం ఉపాధి అభివృద్ధికి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. మిర్యాలగూడ క్లస్టర్ పరిధిలోని దివ్యాంగులకు హాలియా పట్టణంలో శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఎస్ ఇ ఆర్ పి ఆధ్వర్యంలో 28 మంది దివ్యాంగులకు అనుమతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ప్రతినిధులు ఆనంద్,సాయి తేజ,ఓం ప్రకాష్,మణికంఠ,ఏపిఎం లక్ష్మీనారాయణ,సైదులు,విజయ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి వేళలో తహసిల్దార్ వల్లపు ప్రదీప్ బృందం నిఘా.....

### రఘునాధపురం వాగులో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల పట్టివేత....

రాజాపేట మే 22 (ప్రజా జ్యోతి ) నమ్మదగిన సమాచారం మేరకు తహసిల్దార్ వల్లపు ప్రదీప్ రాత్రి వేళలో అక్రమ ఇసుక రవాణా పూర్తిగా అరికట్టి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కష్టపడుతున్నారు.

రాజాపేట మండలంలోని రఘునాధపురం వాగులో రాత్రి వేళలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లను తహసిల్దార్ వల్లపు ప్రదీప్ బృందం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. జీపీవో గజ్వేల్ కవిత ఫిర్యాదు మేరకు ఎస్సై లింగారెడ్డి కేసు నమోదు చేశారు. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పూర్మ రాజేష్, వేముల చందు అనే డ్రైవర్లు, ట్రాక్టర్ యజమాని బెదరబోయిన రాములు సూచనల మేరకు అక్రమంగా ఇసుక తరలించారు.

ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణా నూరు శాతం అరికట్టేందుకు తహసిల్దార్ వల్లపు ప్రదీప్ చేస్తున్న ఎనలేని కృషి, సాహసం పట్ల అన్ని పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు రైతులు ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

# ఉపాధి కూలీలకు పెరుగన్నం మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న గుర్రం శ్రవణ్ కుమార్.



**రాజాపేట మే 22 (ప్రజా జ్యోతి )**

రాజపేట మండల కేంద్రానికి చెందిన 8వ, వార్డు సభ్యులు గుర్రం శ్రవణ్ కుమార్ మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం ఉపాధి కూలీ పని చేస్తున్న కూలీలకు పెరుగన్నం మజ్జిగ ప్యాకెట్లను స్వయంగా అందజేశారు. ఉపాధి కూలీ పని చేస్తున్న స్థలానికి వెళ్లి కూలీలకు పెరుగన్నం స్వయంగా వడ్డించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మరుసటి రోజు నిమ్మరసాన్ని ఇవ్వనున్నట్లు గుర్రం శ్రవణ్ కుమార్ చెప్పారు. గుర్రం శ్రవణ్ కుమార్ అందిస్తున్న సేవా సహాయ కార్యక్రమాలకు కృతజ్ఞతలు చెబుతూ ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న గుర్రం శ్రవణ్ గత కొన్ని సంవత్సరాల నుండి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్నారు. ఆయన సేవలు ఆదర్శంగా ఉన్నాయని పలువురు కితాభిచ్చారు. ఉపాధి కూలీలకు అందించిన సహాయ సహకారం పట్ల ఇన్చార్జి ఎంపీడీవో అల్లం ఇన్నారెడ్డి, ఈజీఎస్ ఏపీవో కర్ణాకర్ లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# ఇందిరామ్మా ఇండ్ల లబ్ధిదారులకు కంటనీరు పెట్టిస్తున్న మేస్త్రీలు.....

**రాజాపేట మే 22( ప్రజా జ్యోతి**

)పేద నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేరేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాజపేట మండలంలో నతకే నడక నేర్పినట్లుగా ఉంది. సగం కంటే తక్కువ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి కావడం అందుకు నిదర్శనం. మండలంలో కొందరు సర్పంచులు మాత్రమే నూరు శాతం ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేందుకు కృషి చేస్తుండగా మిగిలిన వారు శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో పనుల్లో వేగం తక్కువగా ఉంది. మండలంలో 23 గ్రామపంచాయతీలో 484 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా కేవలం 190 ఇండ్లు మాత్రమే పూర్తయ్యాయి. మరో 87 ఇండ్లు పూర్తి అయ్యే దశలో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జూన్ 2వ, తేదీ నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ పరిస్థితులు మాత్రం ఆ విధంగా కనబడడం లేదు. జాల గ్రామంలో 12 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా కేవలం రెండు మాత్రమే పూర్తయ్యాయి. కొత్తజాల లో ఐదు ఇండ్లు మంజూరు కాగా కేవలం ఒక ఇల్లు మాత్రమే పూర్తయింది. మండల కేంద్రమైన రాజాపేట లో కూడా ఇండ్ల నిర్మాణాలు వేగంగా సాగడం లేదు. 41 ఇండ్లు మంజూరీ కాగా 15 ఇండ్లు పూర్తయ్యాయని మరో 5 ఇండ్లు పూర్తి అయ్యే దశలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చల్లూరు లో 27 కు గాను ఐదు ఇండ్లు, కాల్వపల్లి లో 20 ఇండ్లకు గాను ఐదు ఇండ్లు , పాము కుంటలో 24 ఇండ్లకు గాను ఆరు ఇండ్లు, దత్తత గ్రామమైన బూరుగుపల్లి గ్రామానికి 28 ఇండ్లు మంజూరు కాగా కేవలం నాలుగేండ్లు మాత్రమే పూర్తయ్యాయని అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కాగా రఘునాథపురం గ్రామానికి 43 ఇండ్లు మంజూరి కాగా 27 ఇండ్లు పూర్తి కావడంతో పాటు మరో 10 ఇండ్లు పూర్తయ్య దశలో ఉన్నట్లు కలెక్టర్ కు పంపిన నివేదికలు చెబుతున్నాయి. లక్ష్మక్క పల్లి గ్రామానికి 8 ఇండ్లు మంజూరు కాగా 4 పూర్తి త్వరలోనే మిగిలిన 4 పూర్తికానున్నట్లు గృహనిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. రఘునాథపురం, లక్ష్మక్కపల్లి గ్రామాల లబ్ధిదారులను ఆయా గ్రామాల నాయకులు ప్రోత్సహిస్తూ నూరు శాతం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి కోసం కష్టపడుతూ అడుగులు వేస్తున్నారు. పరిస్థితిని బట్టి చూస్తే రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరిలో కోతపడే ప్రమాదం కనిపిస్తుంది. ముఖ్యంగా మేస్త్రీల అలసత్వం, వారి స్వార్థం కోసం కొందరు మేస్త్రీలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఖర్చును మూడు రెట్లు పెంచి లబ్ధిదారులను ఆర్థికంగా నష్టపెడుతూ అవస్థలు పడేలా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపడితే 8 లక్షల రూపాయల లోపు డబ్బులు మాత్రమే ఖర్చు అయ్యే పరిస్థితులు ఉండగా కొందరు మేస్త్రీలు స్వార్థం కోసం 12 నుండి 15 లక్షల రూపాయల ఖర్చు అయ్యేలా అదనంగా పనులు చేస్తూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులపై అడ్డగోలు ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. ఎలివేషన్ ప్రహరీ గోడ లాంటి నిర్మాణాలు చేస్తూ మేస్త్రీలు నానా తిప్పలు పెడుతున్నారు. బూరుగుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు మెటీరియల్ తో సహా ఎనిమిది లక్షల వరకు మేస్త్రిలు చేపట్టగా, ఇతర గ్రామాల్లో 12 నుండి 13 లక్షల రూపాయల వరకు మేస్త్రిలు కాంట్రాక్టు తీసుకొని లబ్ధిదారులకు కంటనీరు పెట్టిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికారులు కూడా నోరు మెదపకుండా లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారు. దీంతో కొందరు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోకుండా తప్పని పరిస్థితుల్లో మంచి రోజులు ఉన్నాయనే ఉద్దేశంతో గృహప్రవేశం చేసుకున్నారు. ఏది ఏమైనా రాజపేట మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోవడం తో ఈ ప్రభావం రెండో విడత ఎంపికపై పడనున్నట్లు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న జీరో కరెప్టెడ్ లో మొదటి స్థానంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

# సీఎం రాకతో ఆలేరుకు మహర్దశ:మెడిశెట్టి

రాజాపేట మే 22( ప్రజా జ్యోతి ) అభివృద్ధి ప్రధాతగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు వస్తున్న సందర్భంగా ఆలేరుకు మహర్దశ రానుందని, అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కానున్నాయని రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేడిశెట్టి సురేందర్ అన్నారు. శుక్రవారం ఆయన రాజపేట విలేఖరులతో మాట్లాడారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో 100 కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు భక్తుల పక్షాన సురేందర్ కృతజ్ఞతలు చెప్పారు. ముఖ్యమంత్రి సన్నిహితులుగా కొనసాగుతున్న బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రత్యేక నిధులు మంజూరి కోసం చేస్తున్న కృషి అమోఘం అన్నారు. సీఎం రాకతో రాజపేట మండలం తో పాటు అన్ని మండలాలకు ప్రత్యేక అభివృద్ధి పనులు రానున్నట్లు ఆయన చెప్పారు.



# నిడమానూరులో విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

నిడమానూరు,మే 22 (ప్రజాజ్యోతి):విద్యుత్ షాక్ తో డ్రైవర్ పిడుగు రాజు(40) మృతి చెందిన సంఘటన నిడమనూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చెరువులో చేపల వేటకు వెళ్లి కరెంట్ సర్వీస్ వైరుకు తీగ తగిలించి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ ఎర్త్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య పిడుగు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# స్వాములవారి లింగోటంలో సురక్షిత తాగునీటి ప్లాంట్ ప్రారంభం

## ఎల్లప్పుడూ ప్రజల అండగా ఉంటాం: సర్పంచ్ బీమిడి ప్రదీప్

## శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో అభివృద్ధి

**చౌటుప్పల్, మే 22 ( ప్రజా జ్యోతి ):**

మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామ ఉదయగిరి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను సర్పంచ్ బీమిడి ప్రదీప్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తాము ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉండడమే తమ లక్ష్యమన్నారు.

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో రాబోయే రోజుల్లో ప్రజలకిచ్చిన ప్రతి ఒక్క హామీని మునుముందు నెరవేరుస్తానని సర్పంచ్ ప్రకటించారు. గ్రామంలో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు, ఈ ప్లాంట్ నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన 'సూర్య ఆగ్రో ఫామ్స్' యాజమాన్యానికి గ్రామ ప్రజల తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ్య, వార్డు మెంబెర్ రాదారపు సత్తయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్



చెన్నగోని అంజయ్య, దేవస్థానం చైర్మన్ కుర్నాల వెంకటేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చేవెళ్లి కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ చొప్పరి సాయి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర విక్రమ్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ మెంబెర్ గంగాపురం నరహరి, మాజీ ఉపసర్పంచ్ గంగాధర్, నాయకులు ఆకుల మధు, శ్రీనివాస్, రవి, ఉప్పు వీరయ్య, నర్సింహా, చిన్ని కృష్ణ, పిట్టల సదానందం, జనార్దన్ రెడ్డి, నాగయ్య, ఎల్లయ్య, రమేష్, నాగరాజు రెడ్డి, శ్రీకాంత్, వెంకటేశ పాల్గొన్నారు.

